

పైడిమాంబ దేవస్థానం ఈవోగా ప్రసాదరావు

విజయనగరం రూరల్ : పైడిమాంబ దేవస్థానం ఈవోగా డీవీవీ ప్రసాదరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. రామతీర్థం దేవస్థానం, మాన్సాస్ ట్రస్టు అధికారిగా కొనసాగుతున్న ప్రసాదరావును సాధారణ బదిలీల్లో భాగంగా విజయనగరం పైడిమాంబ దేవస్థానానికి బదిలీ చేశారు. ఇంతవరకు ఈవోగా కొనసాగిన సుధారాణిని అనకాపల్లి జిల్లా దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా నియమించారు. ఈవోగా బాధ్యతలు చేపట్టిన ప్రసాదరావు మాట్లాడుతూ, ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. మేలో దేవర ఉత్సవం, అక్టోబరులో సిరిమాను పండగను వైభవంగా నిర్వహిస్తామన్నారు.

మాన్సాస్‌ను కొల్లగొట్టేందుకు కోలగట్ల పన్నాగం

- ఎమ్మెల్యే అక్రమాలను ప్రజలకు వివరిస్తాం
- టీడీపీలో చేరిన వైసీపీ నాయకుల ప్రకటన
- నియంత పాలనకు స్వస్తి చెబుతామని స్పష్టం
- నగరంలో భారీ ర్యాలీ.. పార్టీలోకి ఆహ్వానించిన అశోక్



అశోక్‌గజపతిరాజు, కళావెంకటరావు సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు, వారి అనుచరులు

విజయనగరం(ఆంధ్రజ్యోతి), ఫిబ్రవరి 19: మాన్సాస్ ఆస్తులు కొట్టేయడానికి ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి పన్నాగం పన్నారని, అందులో భాగంగానే కొత్త ఛైర్‌పర్సన్‌ను నియమించారని, దేవుడి దయతో ప్రజల అదృష్టంతో వారి పన్నాగాలు ఫలించలేదని టీడీపీలో తాజాగా చేరిన వైసీపీ నాయకుడు పిళ్లా విజయ్‌కుమార్ ఆరోపించారు. తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు అశోక్‌గజపతిరాజు, కిమిడి కళావెంకటరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున సమక్షంలో సోమవారం ఆయన టీడీపీ కండువా వేసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే చేసిన అక్రమాల గురించి సభలు పెట్టి మరీ ప్రజలకు వివరిస్తామన్నారు. మరో నాయకుడు అవనాపు విజయ్ కూడా టీడీపీలో చేరారు. వీరిద్దరితో పాటు చిన్నమ్మలు, గాడు అప్పారావు నేతృత్వంలో నగర, డివిజన్ నేతలు, కార్యకర్తలు ఒకేసారి సైకిలెక్కారు. అంతకుముందు వేలాది మంది అనుచరులతో పులివేశాల ప్రదర్శనతో పైడితల్లమ్మ గుడి నుంచి గంటస్తంభం, రైల్వేస్టేషన్ మీదుగా భారీ ర్యాలీగా టీడీపీ జిల్లా కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం పార్టీ పెద్దల సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా అశోక్‌గజపతి రాజు మాట్లాడుతూ సైకో జగన్‌పాలనలో రాష్ట్ర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, 2024లో ప్రజలు ఆలోచించి అభివృద్ధి చేసే పార్టీకే ఓటు వెయ్యాలని పిలుపునిచ్చారు. అవనాపు విజయ్, పిళ్లా విజయ్‌కుమార్ తెలుగుదేశం పార్టీలో చేరటం వల్ల పార్టీ మరింత బలోపేతమవుతుందన్నారు. కిమిడి కళా వెంకటరావు మాట్లాడుతూ జిల్లాను వైసీపీ నేతలు దోచుకుతింటున్నారని, వారి అక్రమాలకు అడ్డుకట్ట వెయ్యాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

- పిళ్లా విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే చేసిన అక్రమాల గురించి ప్రజలందరికీ వివరిస్తామన్నారు. నగరానికి మంచినీరు తెచ్చింది పూసపాటి కుటుంబ మేనని చెప్పారు. ముసిడిపల్లి నీటిని నగరానికి అందించిన ఘనత అశోక్‌దేనన్నారు. అవనాపు విజయ్ మాట్లాడుతూ నగర ప్రజలను రాక్షస పాలన నుంచి విముక్తి చేస్తామని, నగరంలో టీడీపీ జెండా ఎగురవేస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు అదితి గజపతిరాజు, బేబీనాయన, కర్రోతు బంగార్రాజు, కేఏ నాయుడు, నాయకులు కంది చంద్రశేఖర్, కలిశెట్టి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పిళ్లా విజయకుమార్, అవనాపు విజయ్

టీడీపీలో సమరోత్సాహం

- లోకేశ్ శంఖారావం యాత్రతో టీడీపీ శ్రేణులకు కొత్త జవసత్వాలు
- సూపర్-6ను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు కంకణం
- కొత్త చేరికలతో మరింత బలం

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శంఖారావం యాత్రతో ఆ పార్టీ జిల్లా శ్రేణులకు కొత్త జవసత్వాలు వచ్చాయి. ఇక సమరోత్సాహంతో ముందుకు దూకాలని భావిస్తున్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో పాటు చంద్రబాబు ప్రకటించిన సూపర్-6ను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని కంకణం కట్టుకున్నారు. మరోవైపు రోజురోజుకూ టీడీపీలోకి వలసలు పెరుగుతున్నాయి. వైసీపీలోని కీలక నాయకులు తమ అనుచరులతో తెలుగుదేశంలో చేరుతున్నారు.

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

భోగాపురంలో జరిగిన యువగళం సభ రాష్ట్రస్థాయిలో చర్చకు దారితీసిన విషయం తెలిసిందే. ఆ సభకు వచ్చిన ప్రజలను చూసి ప్రతిపక్షం వెన్నులో వణుకుపుట్టింది. అప్పటి నుంచి టీడీపీ శ్రేణుల్లో మొదలైన సమరోత్సాహానికి తాజాగా ముగిసిన శంఖారావం సభలు మరింత బలాన్ని ఇచ్చాయి. ఇక దూసుకెళ్లాలన్న ఉత్సుకతను ప్రోదిచేశాయి. ఈనెల 14నుంచి 17వరకు వివిధ నియోజకవర్గాల్లో శంఖారావం బహిరంగ సభలను లోకేశ్ చేపట్టారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడంతో పాటు స్థానిక ఎమ్మెల్యేల దందాలపై ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చిన వెంటనే వైసీపీ ఎమ్మెల్యేలు చేసిన అరాచకాలపైనా.. దోపిడీలపైనా చర్యలు తీసుకుంటామని గట్టిగా చాటారు . అదే విధంగా టీడీపీ ప్రభుత్వం వస్తే ప్రజలకు అందించే సూపర్-6 హామీలను ప్రతి సభలోనూ వివరించారు. టీడీపీ, జనసేన ఉమ్మడిగా రూపొందించిన ఈ హామీలను ప్రజల్లోకి తీసుకువెళ్లేలా కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. సూపర్-6 పథకాలు అందరినీ ఆలోచింపజేస్తున్నాయి. ● ఐదేళ్లలో 20లక్షల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ప్రకటించారు. ● అమ్మఒడి పథకాన్ని మరింతగా విస్తరిస్తామని పేర్కొన్నారు. ● ప్రతి కుటుంబానికీ ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తామని ప్రకటించారు. ● మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కూడా మహిళల్లో చర్చనీయాంశం అవుతోంది. ● రైతులను ఆదుకునేందుకు వీలుగా ఏటా రూ.20వేల ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించారు. ● 18నుంచి 59 ఏళ్ల మధ్య మహిళలకు ప్రతి నెలా రూ.1500 చొప్పున అందించనున్నట్లు ప్రకటించారు.



విజయ్, విజయకుమార్‌లు టీడీపీలో చేరకను పురస్కరించుకుని విజయనగరంలో చేపట్టిన ర్యాలీ



రాజాంలో జర్నలిస్టుల నిరసన ర్యాలీ

ఇంత అరాచకమా?

- ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడికి జర్నలిస్టుల నిరసన
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు

రాజాం రూరల్, ఫిబ్రవరి 19: జర్నలిస్టులకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వం దాడులను ప్రోత్సహించడం సిగ్గుచేటని రాజాం మీడియా ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. అనంతపురం జిల్లా ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై రాప్తాడు వద్ద జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ సోమవారం ర్యాలీ చేశారు. ప్రాంతీయ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు భీంపల్లి తిరుపతిరావు ఆధ్వర్యంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు అంబేడ్కర్ జంక్షన్ వరకూ ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దాడిని తీవ్రంగా ఖండించారు. అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం తహసీల్దార్ కృష్ణంరాజుకు కూడా వినతినిచ్చారు. ఈసందర్భంగా సీనియర్ జర్నలిస్టులు శర్మ, నీలకంఠేశ్వర యాదవ్, తిరుపతిరావు మాట్లాడుతూ విధినిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై దాడులు చేసినవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్నివర్గాలపైనా దాడులు పెరిగిపోయాయన్నారు. ఇది మంచి సంప్రదాయం కాదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆందోళనలో జర్నలిస్టులు చంద్రశేఖర్, వెంకటరావు, తిరుమల, గణేష్, అన్నారావు, చందు, మురళి, గోవిందరావు, జగదీష్, శ్రీనివాసరావు, మోహన్, రాజేష్, ఉపేంద్ర, కిశోర్, మూర్తి, పురుషోత్తం, శ్రీధర్, వెంకటరావు, రామారావు తదితరులంతా పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణం
చూతము రారండి

- రామతీర్థంలో ఏర్పాట్లు పూర్తి



సీతారామలక్ష్మణుల ఉత్సవ విగ్రహాలు

నెల్లిమర్ల, ఫిబ్రవరి 19: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం రామస్వామి దేవస్థానంలో సీతారాముల తిరుక్కల్యాణ మహోత్సవం ఈ నెల 20వ తేదీ మంగళవారం రాత్రి జరుగునుంది. ఇందుకు సంబంధించి దేవస్థానం కార్యనిర్వహణాధికారి వై.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. అలయాన్ని సుందరంగా అలంకరించారు. మామిడాకులు, కొబ్బరి ఈనెలు, పూలతో ఆలయాన్ని, కల్యాణోత్సవం జరుగునున్న వేదికను అలంకరించారు. ఏటా భీష్మ ఏకాదశి పర్వదినం నాడు దేవస్థానంలో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించడం దశాబ్దాల నుంచి ఆనవాయితీగా వస్తోంది. ఉత్సవంలో భాగంగా సీతారామలక్ష్మణులను అశ్వ, గరుడ, హంస వాహనాలపై ప్రధాన వీధుల్లో ఊరేగిస్తారు. ఉత్సవాన్ని తిలకించేందుకు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు హాజరవుతారు. కాగా శ్రీరామచంద్రుడి తరపున ఆలయ ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు దంపతులు గాని, వారి ప్రతినిధులు గాని హాజరై స్వామికి పట్టువస్త్రాలను సమర్పించనున్నారు. అలాగే సీతమ్మతల్లి తరపున పూసపాటిరేగకు చెందిన ఏకుల అప్పలస్వామి కుటుంబీకులు హాజరై బంగారు శతమానం, పట్టువస్త్రాలు సమర్పిస్తారు. రాత్రి పది గంటల నుంచి అర్ధరాత్రి 2 గంటల వరకు కల్యాణోత్సవం జరుగనుంది. కల్యాణోత్సవాన్ని దేవస్థానం స్థానాచార్యులు గొడవర్తి నరసింహాచార్యులు ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు ఖండవిల్లి సాయిరామాచార్యులు, అర్చకులు ఖండవిల్లి కిరణ్‌కుమార్, పాణంగిపల్లి ప్రసాద్, సుదర్శనం పవన్‌కుమార్, రామ్‌గోపాల్ తదితరులు నిర్వహిస్తారు.

ఘనంగా అంకురారోహణ

రామతీర్థంలో కల్యాణానికి సోమవారం అంకురారోహణ తంతు ఘనంగా జరిగింది. ఉదయాన్నే ప్రాతః కాలార్చన బాలభోగం, యాగశాలలో సుందరకాండ హవనం తదితర ప్రక్రియలను ఆలయ అర్చకులు నిర్వహించారు. సాయంకాలం 5 గంటలకు శ్రీ సుదర్శన పెరుమాళ్ళను పల్లకీలో కొండమెట్ల వద్దకు తీసుకువెళ్లి విశ్వక్సేన ఆరాధన, స్వస్తి పుణ్యాహవచనం జరిపించారు. అనంతరం స్వామిని ఊరేగింపుగా దేవాలయంలోకి తీసుకువచ్చి అంకురారోహణ నిర్వహించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి వై.శ్రీనివాసరావు, భక్తులు గ్రామ ప్రజలు, సిబ్బంది పాల్గొన్నారు.



3,4,5 తేదీల్లో పల్స్ పోలియో: కలెక్టర్

కలెక్టరేట్, ఫిబ్రవరి 19: మార్చి 3న నేషనల్ ఇమ్యూనైజేషన్ డే పురస్కరించుకుని ఆ నెల 3,4,5 తేదీల్లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. సోమవారం జగనన్న స్పందన కార్యక్రమంలో భాగంగా ఆమె మాట్లాడుతూ పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. మార్చి 3వ తేదీన మోగా వ్యాక్సినేషన్ డ్రైవ్‌గా 0 నుంచి 5 సంవత్సరాల పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని తెలిపారు. మిగిలినవారికి ఇంటింటికీ వెళ్లి 4,5 తేదీల్లో పోలియో చుక్కలు వేయాలన్నారు. మారుమూల గ్రామాలు, కొండ ప్రాంతాలు, గిరిజన, మత్స్యకార ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, బస్సు స్టాండ్‌లోనూ, రైల్వే స్టేషన్లలోనూ పోలియో బూత్‌లు ఏర్పాటు చేయాలన్నారు. అన్ని ఆసుపత్రుల్లో కూడా పోలియో చుక్కలు వేయడానికి తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. 2వ తేదీన అన్ని గ్రామాల్లో టామ్ టామ్ వేయించాలని సూచించారు. వ్యాక్సిన్ నిల్వల కోసం నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని ఆదేశించారు.

మెగా డీఎస్సీ కావాలి

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంత్రి బొత్స ఇంటిని ముట్టడించిన నిరుద్యోగులు

విజయనగరం రింగురోడ్డు, ఫిబ్రవరి 19: దగా డీఎస్సీ కాదు.. మెగా డీఎస్సీ కావాలి.. 30వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి.. అని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరుద్యోగులు మంత్రి బొత్స సత్యనారాయణ ఇంటిని సోమవారం ముట్టడించారు. ర్యాలీగా అక్కడికి చేరుకున్న వారంతా తమ డిమాండ్లపై నినాదాలు చేశారు. అనంతరం పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను నెట్టుకుంటూ మంత్రి ఇంటిలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో పోలీసులు, యువజన కాంగ్రెస్ నేతల మధ్య తోపులాట జరిగింది. యువజన కాంగ్రెస్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని వన్‌టౌన్ స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు లక్కరాజు రామారావు మాట్లాడుతూ, జగన్మోహన్‌రెడ్డి మాట తప్పారని, నిరుద్యోగులను మోసం చేశారని విమర్శించారు. నిరుద్యోగులంతా సీఎంను గద్దె దింపడానికి సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

మెగా డీఎస్సీ ద్వారా 30 వేల టీచర్ పోస్టులు విడుదల చేయకపోతే, రాష్ట్ర వ్యాప్తంగా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంత్రులు, ఎమ్మెల్యేలను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పూడి శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగాడ శ్రీనివాస్, తోడేటి సందీప్ ఐశ్వర్, సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.





బొత్స ఇంటి ముందు కాంగ్రెస్ నాయకులు, పోలీసుల వాగ్వాదం



అంకురారోహణ పూజల్లో అర్చకులు

టీడీపీ హయాంలోనే అభివృద్ధి


మాట్లాడుతున్న అదితి


మాట్లాడుతున్న కోండ్రు మురళి

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 19: టీడీపీ హయాంలోనే విజయనగరం నియోజకవర్గం అభివృద్ధి చెందిందని ఆ పార్టీ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు చెప్పారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... నగరంలోని 12 రోడ్లు, ప్రధాన కూడళ్ల అభివృద్ధి టీడీపీ హయాంలోనే పూర్తి చేశామని చెప్పారు. ఈలోగా ఎన్నికలు రావడంతో కొన్ని మిగిలిపోయాయని అన్నారు. నాలుగేళ్ల పది నెలల కాలంలో వైసీపీ నాయకులు కేవలం 4 రోడ్లు మాత్రమే పూర్తి చేయగలిగారన్నారు. టీడీపీ హయాంలో ఏర్పాటు చేసిన పథకాలను ఈ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు టీడీపీకే ఓటు వేయనున్నారని, ఫ్యాన్ రెక్కలు విరగడం ఖాయమని ఆమె చెప్పారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారు బాబు, బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు, వేచలపు శ్రీను తదితరులు పాల్గొన్నారు. ● **రాజాం:** మరో 50 రోజుల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని సాగనంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ అన్నారు. సోమవారం రాత్రి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల స మా వేశంలో ఆయన వైసీపీ ప్రభుత్వంపై విరుచుకుప డ్డారు. ఓటమి భయంతో 77 మందిని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మడతే శారన్నారు. ఎవరిది అభివృద్ధి పాలనో ఎవరిది విధ్వంస పాలనో ప్రజలకు తెలు సన్నారు. జగన్‌కు అసలు రాయలసీమలో సభ పెట్టే అర్హత లేదన్నారు. కార్యక్ర మంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు నంది సూర్యప్రకాష్‌రావు, కిమిడి అశోక్‌కుమార్, గురవాన నారాయణరావు, దుప్పలపూడి శ్రీనివాసరావు, వంగా వెంకటరావు, దూబ ధర్మారావు, మరిపి జగన్‌మోహన్, టంకాల నాగరాజు తదితరులు పాల్గొ న్నారు. ● సిద్ధం పేరుతో కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని, ఆర్టీసీ బస్సులను కూడా సమావేశాలకు తరలించి ప్రయాణికులకు నర కం చూపిస్తున్నారని కోండ్రు విమర్శించారు. సోమవారం శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన రేగిడి మండల టీడీపీ నాయకులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. సభ నిజంగా విజయవంతం అయి ఉంటే వైసీపీ రౌడీలు ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై ఎందుకు దాడి చేస్తారని కోండ్రు ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌ను ఇంటికి పంపించకపోతే రాష్ట్రం పూర్తిగా నశనం అవ్వడమే కాకుండా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతారన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు కిమిడి అశోక్‌కు మార్, దూబ ధర్మారావు, మంతిన ఉషారాణి, కర్నేన మహేష్, మజ్జి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు 182 వినతులు

● స్వీకరించిన కలెక్టర్ నాగలక్ష్మి

కలెక్టరేట్: కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వివిధ సమస్యలపై 182 వినతులు వచ్చాయి. వీటిని కలెక్టర్ నాగలక్ష్మి, డీఆర్‌వో అనిత, డిప్యూటీ కలెక్టర్లు సుమబాల, మురళి కృష్ణ, సీపీవో బాలాజీ స్వీకరించారు. రెవెన్యూ శాఖ సమస్యలపై 129, డీఆర్‌డీఏకు సంబంధించి 11, గ్రామ వార్డు సచివాలయం శాఖకు 12, జిల్లా పంచాయతీ విభాగానికి 7, గృహ నిర్మాణానికి 7, జిల్లా ఆసుపత్రులకు సంబంధించి 3, ఏపీ విద్యుత్ పంపిణీ సంస్థకు సంబంధించి 3 వినతులు, మున్సిపల్ శాఖకు 10 చొప్పున వినతులు అందాయి. భూ సమస్యలపై అధికంగా వినతులు అందినట్టు అధికారులు తెలిపారు. ● పూసపాటిరేగ మండలంలోని చోడమ్మ అగ్రహారం గ్రామ పంచాయతీ పరిదిలో సుమారు 100 ఎకరాలు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. ఆయా భూమిలో విద్యుత్ లైన్లు వేసి వ్యవసాయ కనెక్షన్లు వేసుకుని మామిడి, జీడి మామిడి మొక్కలు వేసి సాగు చేస్తున్నారు. డి.పట్టా భూములను కొనుగోలు చేసి ప్రైవేటు వ్యక్తులకు ఎకరా రూ.20 లక్షలకు విక్రయించడానికి అగ్రిమెంట్ చేసుకున్న అదే మండలం పోరాం గ్రామానికి చెందిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలన్నారు. అదే గ్రామ పరిధిలో సర్వే నెంబరు 1-5లో సుమారు 20 ఎకరాలు, సర్వే నెంబరు 1-3లో 19 సెంట్లు, సర్వే నెంబరు 1-2లో 44 సెంట్ల భూమిని ఆక్రమించేశారు. దీనిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని గ్రామానికి చెందిన నిరుపేదలకు పంపిణీ చేయాలని చోడమ్మ అగ్రహారం గ్రామ మాజీ సర్పంచ్ నల్ల అప్పలరాజుతో పాటు పలువురు రైతులు కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. ● విజయనగరం పట్టణంలోని వీటీ అగ్రహారంలో ఉన్న జ్యూట్ మిల్లు మూత పడింది. ఆ కంపెనీ నమ్ముకుని వేలాది మందికి ఉపాధి లేక రోడ్డున పడ్డారు. అయితే ఆయా కంపెనీకి ఉన్న భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ఇక్కడ ఏదైనా ప్రభుత్వ భవనం నిర్మాణాలకు వినియోగించాలని జనసేన నాయకులు రౌతు సతీష్ కుమార్ మొర పెట్టుకున్నారు.

● విజయనగరం పట్టణంలోని రింగురోడ్డు పరిధిలో అనధికారికంగా షాపులు నిర్మాణం జరుగుతున్నాయి. గత కొద్ది కాలం నుంచి రింగు రోడ్డు పరిధిలో పక్కాగా షాపులు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇలా అక్రమంగా షాపులు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. అభివృద్ధి చెందిన ఈ ప్రాంతంలో అక్రమంగా షాపులు ఏర్పాటు చేయడంతో ప్రజలు ఇబ్బంది పడను న్నారు. వెంటనే దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని విజయనగరం నియోజకవర్గానికి చెందిన తెలుగు దేశం పార్టీ నాయకులు ఐవీపీ రాజు, కనకల మురళీ మోహన్ తదితరులు విన్నవించుకున్నారు.


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్


కలెక్టరేట్: చోడమ్మ అగ్రహారం గ్రామస్థుల నిరసన

ఫిర్యాదులపై చర్యలు తీసుకుంటాం

● 'స్పందన'లో అదనపు ఎస్పీ ఆష్మాపరహీన్

విజయనగరం క్రైం, ఫిబ్రవరి 19: ఉద్యోగాలు ఇస్తామంటూ మోసాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అదనపు ఎస్పీ ఆష్మాపరహీన్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో 'స్పందన' కార్యక్రమంలో 33 ఫిర్యాదులు స్వీకరించారు. ● నగరానికి చెందిన కొంతమంది వ్యక్తులకు అంగన్‌వాడీ ట్రైనర్స్, సూపర్‌వైజర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని నెల్లూరుకు చెందిన వ్యక్తి రూ.15 లక్షలు తీసుకున్నారని, నేటి వరకూ ఎటువంటి ఉద్యోగాలు ఇవ్వలేదని, న్యాయం చేయాలని విజయనగరానికి చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు చేశారు. ● తన ప్రాంతానికి చెందిన వ్యక్తి స్మార్ట్ యోజన వెల్ఫేర్ సొసైటీలో ఉద్యోగం కల్పిస్తానని నమ్మించి తన నుంచి రూ. 1.60లక్షలు తీసుకుని నేటి వరకూ ఎటువంటి ఉద్యోగం ఇవ్వలేదని, డబ్బులు కూడా తిరిగి చెల్లించలేదని, న్యాయం చే యాలని డెంకాడ మండలం చింతలవలసకు చెందిన వ్యక్తి కోరారు. ● విశాఖపట్టణానికి చెందిన కొంత మంది క్వారీలో భాగస్వామ్యం కావాలని బలవంతంగా తన లైసెన్సు, ఇతర పత్రాలు తీసుకుని బెదిరింపులకు పాల్ప డుతున్నారని, న్యాయం చే యాలని ఎల్.కోట మండలం కళ్లంపూడి గ్రామానికి చెందిన వ్యక్తి కోరారు. ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించి, తీసుకున్న చర్యలపై నివేదిక అందించాలని సంబంధిత పోలీసు అధికారులను ఏఎస్పీ ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీ వీరకుమార్, సీఐ మురళి, ఎస్‌ఐ ప్రభావతి, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఫిర్యాదుదారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఏఎస్పీ అష్మా పరహీన్

అవగాహన సదస్సులతో ప్రమాదాల నివారణ

● రవాణా శాఖ ఉప కమిషనర్ రవీంద్రనాథ్

విజయనగరం క్రైం, ఫిబ్రవరి 19: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవగాహన సదస్సులు నిర్వహించి.. ప్రమాదాల నియంత్రణకు కృషి చేస్తున్నాయని రవాణా శాఖ ఉప కమిషనర్ జీఆర్ రవీంద్రనాథ్ అన్నారు. 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల ముగింపు కార్యక్రమం రవాణా శాఖ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ మాట్లాడుతూ నెల రోజుల పాటు నిర్వహించిన కార్యక్రమాల్లో వాహన చోద కులకు అవగాహన కల్పించామన్నారు. సీటు బెల్టు, హెల్మెట్ ధరించాలని, అతి వేగంగా వాహనాలు నడపకూడదని సూచించామన్నారు. ఇన్‌చార్జి ఆర్‌టీవో ఎస్.రమేష్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఏవీ రమణ, యు.దుర్గాప్రసాద్, కె. రవిశంకర్‌ప్రసాద్, ఎంవీఐ ఐశ్వర్యలక్ష్మి, పరిపాలనాధికారి ఎం.లత, కార్యాలయ సిబ్బంది, వాహన డ్రైవర్లు పాల్గొన్నారు.


డీటీసీ రవీంద్రనాథ్‌ని సత్కరిస్తున్న ఇన్‌చార్జి ఆర్‌టీవో రమేష్

పేదలకు దుస్తుల పంపిణీ

శృంగవరపుకోట రూరల్, ఫిబ్రవరి 19: తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి.. పటిష్టతకు రాయవరపు అప్పలనాయుడు మాస్టారు చేసిన సేవలు మరువలేనివని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ అన్నారు. సోమవారం అలుగుబిల్లి గ్రామంలో టీడీపీ విశాఖ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు రాయవరపు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అప్పలనాయుడు మాస్టారి వర్ధంతిని నిర్వహించారు. 500 మందికి వస్త్రదానం చేశారు. టీడీపీ విశాఖ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు రాయవరపు చంద్రశేఖర్, వివిధ మండలాల టీడీపీ నాయకులు, మండల పార్టీల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఘనంగా రామాలయ ప్రతిష్ఠ

వంగర: దేవకివాడలో నూతనంగా నిర్మించిన రామాలయ ప్రతిష్ఠా మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు శ్రీనివాస శర్మ ప్రత్యేక హోమాలు చేశారు. ముందుగా సీతారామ విగ్రహాలను ఊరేగించారు. అనంతరం అన్న సమారాధన చేశారు. వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

సంతపాలెం దళితులకు పనులు కల్పించాలి

కొత్తవలస: సంతపాలెం గ్రామంలోనున్న దళిత కుటుంబాలకు ఉపాధి హామీ పను లు కల్పించాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ అధ్యక్షుడు గాడి అప్పారావు ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. గ్రామంలో 50 వరకు దళిత కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. వారికి రెండు రోజులు మాత్రమే ఉపాధి పనులు చెప్పి తరువాత ఆపేశారన్నారు. గ్రామంలో తెలుగుదేశం, వైసీపీ నాయకుల విభేదాల కారణంగా తమకు పని చెప్పడం లేదన్నారు. తాము ఏ పార్టీకీ మద్దతు ఇవ్వడం లేదన్నారు.

మిమ్స్ ఉద్యోగుల తొలగింపు దుర్మార్గం

బాడంగి, ఫిబ్రవరి 19: మిమ్స్ ఉద్యోగులను తొలగించడం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా నాయకులు ఎ.సురేష్ అన్నారు. మిమ్స్ ఉద్యోగులకు మద్దతుగా సోమవారం బాడంగి సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనాలు పెంచాలని మిమ్స్ ఉద్యోగులు పోరాటం చేస్తే యాజమాన్యం కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం అన్యాయమన్నారు. క్రమశిక్షణ చర్యల పేరుతో ఇద్దరిని తొలగించడం అన్యాయమన్నారు.

● **రామభద్రపురం:** కాంట్రాక్టు ఉద్యోగులను ప్రభుత్వం వెంటనే రెగ్యులర్ చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు బలసా శ్రీను డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం కాంట్రాక్టు ఉద్యోగులకు మద్దతుగా రాస్తారోకో నిర్వహించారు. మిమ్స్ ఉద్యోగులు సమ్మెకు దిగి 19 రోజులు కావస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. మిమ్స్ ఉద్యోగుల ప్రతినిధులు రాంబార్కి, రామకృష్ణ, నాగరాజు, జనార్దన పాల్గొన్నారు. ● **కలెక్టరేట్:** తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలంటూ మిమ్స్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద 24 గంటలు నిరసన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు కె.సురేష్, టివి రమణ మాట్లాడుతూ 19 రోజులగా మిమ్స్ ఉద్యోగులు ఆందోళన చేస్తున్న యాజమాన్యాం పట్టించుకోలేదన్నారు. ఈ నిరసన కార్యక్రమం రాత్రి వరకూ కొనసాగించారు. సంఘ నాయకులు తదితరులు ఉన్నారు. ● **బొబ్బిలి:** మిమ్స్ ఉద్యోగులను తొలగించడం దుర్మార్గమంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక చర్చి సెంటరులో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు మాట్లాడుతూ వేతనాలు పెంచాలని మిమ్స్ ఉద్యోగులు పోరాటం చేస్తే... యాజమాన్యం కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం అన్యాయమన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి మణికుమార్, రైతు సంఘం నాయకుడు గోపాలం తదితరులు పాల్గొన్నారు.



బాడంగిలో..



రామభద్రపురంలో..



బొబ్బిలిలో..

గ్రీన్ అంబాసిడర్లకు బకాయిలు చెల్లించండి

బాడంగి, ఫిబ్రవరి 19: గ్రీన్ అంబాసిడర్లకు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ నెల 22వ తేదీలోగా జీతాలు చెల్లించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని సీఐటీయూ నాయకులు ఎ.సురేష్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తుంటే స్థానిక జెడ్పీటీసీ పెద్దింటి రామారావు వచ్చి దుర్భాషలాడారని సురేష్ విలేకరులకు తెలిపారు. వారిని భయభ్రాంతులకు గురి చేయడం సరికాదన్నారు. ఈ విషయమై జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడులకు ఫిర్యాదు చేస్తామన్నారు. చర్యలు చేపట్టకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



బాడంగి ఎంపీడీవో కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న గ్రీన్‌అంబాసిడర్లు

నేటి నుంచి నిరసన దీక్షలు

● జిందాల్ భూ నిర్వాసితుల స్పష్టీకరణ

శృంగవరపుకోట రూరల్, ఫిబ్రవరి 19: తమ న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరించాలని... త్వరలో ఏర్పాటు చేయబోయే ఎంఎస్‌ఎంఈ పార్క్‌లో ఉపాధి కల్పించాలని కోరుతూ మంగళవారం ఉదయం నుంచి రిలే దీక్షలు ప్రారంభిస్తున్నట్లు కిల్తంపాలెం జిందాల్ కార్యాలయం వద్ద నిర్వాసితుల సంఘ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుతో వీరు సమావేశమై తమ కార్యాచరణను వెల్లడించారు. పరిశ్రమలు వస్తాయనే ఆశతో తాము భూములు ఇచ్చామన్నారు. నేటికి 15ఏళ్లుగా ఈ భూముల్లో ఎటువంటి పరిశ్రమ రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు కంపెనీ ఏర్పాటు సమయంలో షేర్లు ఇస్తామని చెప్పి ఇవ్వలేదని తెలిపారు. త్వరలో ఈ ప్రాంతంలో ఎంఎస్‌ఎంఈ పార్క్ ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం, కంపెనీ ప్రతినిధులు ప్రకటనలు చేశారని... అందులో తమకు ఉద్యోగాల కల్పనపై ఇప్పటి వరకు స్పష్టత ఇవ్వలేదన్నారు. కంపెనీ యాజమాన్యం తమ డిమాండ్లపై స్పష్టత ఇచ్చే వరకు ఈ దీక్షలు చేస్తామన్నారు.

వేణుగోపాలుని ఊరేగింపు

బొబ్బిలి: బొబ్బిలి పట్టణ ప్రజల ఇలవేల్పు శ్రీ రుక్మిణీ సత్యభామాసమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం సా యంత్రం స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


స్వామివారి ఊరేగింపు దృశ్యం

విజినిగిరిలో ఉపనయనాలు

జామి: విజినిగిరి యోగాశ్రమంలో సోమవారం వంద మంది పిల్లలకు ఆశ్రమ ప్రతినిధులు శాస్త్రోక్తంగా ఉపనయనాలు నిర్వహించారు. వేదాభ్యాసానికి ముందుగా ఈ కార్యక్రమం చేస్తామని ఆశ్రమ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వృద్ధురాలి హత్య?

● మూలబొడ్డవర గిరిజన గ్రామంలో ఘటన

శృంగవరపుకోట రూరల్, ఫిబ్రవరి 19: ప్రశాంతంగా ఉండే మూలబొడ్డవర ప్రాంతంలో ఒక వృద్ధురాలు హత్యకు గురైంది. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కందుల సోములమ్మ(60) మేకలు మేపుకుని జీవనం సాగిస్తోంది. కుటుంబ సభ్యులు ఉన్నప్పటికీ ఈమెకు పెళ్లికాకపోవడంతో గ్రామంలో వేరుగా ఒక ఇంటిలో ఉంటోంది. ఈ క్రమంలో ఆదివారం మేకలు మేపుకుని వచ్చి తన దినసరి కార్యక్రమాలు పూర్తి చేసుకుని రాత్రి నిద్రపోయింది. సోమవారం తెల్లవారుజామున ఆమె ఎంతకీ నిద్రలేవకపోవడంతో స్థానికులు పరిశీలించగా ఆమె మృతిచెందినట్టు గుర్తించారు. ఆమె శరీరంపై పలు గాయాలు ఉన్నాయని గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. సీఐ షణ్ముఖరావు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. వైద్యులతో పోస్టుమార్టం చేయించారు. అనుమానస్పదమృతిగా నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువకుడి అనుమానాస్పద మృతి

శృంగవరపుకోట రూరల్, ఫిబ్రవరి 19: యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మామిడిపల్లి గ్రా మానికి చెందిన కె.రవితేజ (24) డీగ్రీ పూర్తిచేశాడు. గోస్తనీనది నుంచి ట్రైర్‌బండిపై ఇసుక సేకరించి గ్రామాల్లో విక్రయి స్తుంటాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి గ్రామ సమీపంలో ఉన్న శ్మశానంలో ఒక చెట్టుకు ఊరివేసుకుని మృతిచెందాడు. సోమవారం వేకువ జామున గుర్తించిన స్థానికులు సమాచారం అందించారు. మన స్థాపం చెంది ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అనుమానస్పద మృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.


రవితేజ (ఫైల్)

గడ్డివాములు దగ్ధం

లక్కవరపుకోట, ఫిబ్రవరి 19: మండలంలోని ఎల్‌కేఎస్.పురం నుంచి గోల్జాం వెళ్లే మార్గంలోని పొలాల్లో ఉన్న రెండు ఎండుగడ్డి వాములు సోమవారం దగ్ధమయ్యాయి. ఎల్‌కేఎస్.పురానికి చెందిన టి.ఎర్నాయుడు, గొల్జాం గ్రామా నికి చెందిన టి.శ్రీరామములునా యుడుకు చెందిన రెండు గడ్డివాములు ప్రమాదవ శాత్తు దగ్ధమైనట్టు మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. పశువుల కోసం నిల్వ ఉంచుకున్న రెండు గడ్డివాములు దగ్ధమైన ఇరు కుటుంబాలను లలితకుమారి పరామర్శించారు. ఈమె వెంట మాజీ ఎంపీపీ కొల్లి రమణమూర్తి, సతీష్ తదితరులు ఉన్నారు.


ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న కోళ్ల

దిమ్మిడిజోలలో యువకుడి ఆత్మహత్య

భామిని: మండలంలోని దిమ్మిడిజోల గ్రామానికి చెందిన తాడేల ఏకాశి (20) సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. తల్లిదండ్రులు అప్పన్న, అనుసూయ పొలం పనులకు వెళ్లారు. తిరిగి వచ్చేసరికి ఇంటివద్దే ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఏకాశి కనిపించాడు. చుట్టు పక్కల వారు వచ్చి విగజీవిగా ఉన్న ఏకాశిని కిందకు దించారు. సమాచారం తెలుసుకొని బత్తిలి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని తల్లిదం డ్రుల వద్ద వాంగూల్మం సేకరించారు. కడుపునొప్పి తాళలేక ఉరివేసుకొని ఉండవచ్చని పోలీసులకు కుటుంబసభ్యులు తెలిపారు. ఈ మేరకు ఏఎస్‌ఐ కాంతారావు కేసు నమోదు చేసి పంచనామాకు పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

కోర్టు కాంప్లెక్స్ పనుల పరిశీలన

బొబ్బిలి, ఫిబ్రవరి 19: బొబ్బిలి కోర్టు కాంప్లెక్స్ శంకుస్థాపన పనులను ప్రిన్సిపాల్ జిల్లా జడ్జి బి.సాయి కల్యాణ చక్రవర్తి, న్యాయాధికారులు రషీద్ బాషా, దామోదర్‌లు సోమవారం పరిశీలించారు. ఈ నెల 24 న బొబ్బిలిలో సుప్రీం కోర్టు జడ్జి పమిడిఘంటం శ్రీనరసింహ, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తి ధీరజ్ సింగ్ ఠాకూర్, హైకోర్టు జడ్జిలు నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, దుర్గా ప్రసాద్ తదితరులు పర్యటించనున్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి టి.వాసుదేవన్, జూనియర్ సివిల్ జడ్జి సరోజనమ్మ, కోర్టు మెజిస్ట్రేట్ రోహిణి రావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గంటి గోపాలకృష్ణ శర్మ పాల్గొన్నారు.


కోర్టు కాంప్లెక్స్ శంకుస్థాపన స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా న్యాయాధికారులు

లలిత కుమారిని విమర్శించే స్థాయి వైసీపీకి లేదు

జామి: టీడీపీ మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారిని విమర్శించే స్థాయి వైసీపీ నాయకులకు లేదన్న విషయం తెలుసుకోవాలని మండల టీడీపీ కార్యదర్శి వర్రి రమణ, తెలుగు యువత అధ్యక్షుడు రాయవరపు చంద్రశేఖర్ తదితరులు అన్నారు. సోమవారం సాయంత్రం జామిలో విలేకరుల సమావేశం నిర్వహించారు. లలిత కుమారి అవినీతి చేసిందని చెబుతున్న నాయకులు బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. మరోసారి తమ నాయకురాలిపై అవాస్తవాలు మాట్లాడితే సహించబోమని హెచ్చరించారు.


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

బాధిత కుటుంబాలకు సాయం

కొత్తవలస: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన, గాయపడిన వారి కుటుంబాలను ఎస్.కోట టీడీపీ ఇన్‌చార్జి కోళ్ల లలిత కుమారి సోమవారం పరామర్శించారు. వారి కుటుంబాలకు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఇటీవల కొత్తవలసకు చెందిన పిన్నింటి లక్ష్మి రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. అదే ప్రమాదంలో బత్తిన శ్రీను కాలు విరిగి ఇంటి వద్దనే ఉంటున్నారు. ఈ రెండు కుటుంబాలను పరామర్శించి రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు.

ఉద్యోగులకు మేం వ్యతిరేకం కాదు

మిమ్స్ యాజమాన్యం స్పష్టీకరణ

నెల్లిమర్ల, ఫిబ్రవరి 19: మిమ్స్‌లో యూనియన్‌కు, ఉద్యోగులకు తాము వ్యతిరేకం కాదని, కేవలం బయటి నాయకత్వాన్ని మాత్రమే వ్యతిరేకిస్తున్నామని మిమ్స్ యాజమాన్యం స్పష్టం చేసింది. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. సమస్యలు ఏవైనా ఉంటే ఉద్యోగులు తమతో నేరుగా చర్చించవచ్చని, అలా కాకుండా బయటి వ్యక్తుల ప్రమేయంతో వారి మాటల గారడీలో పడి ఎటువంటి నోటీసు లేకుండా గత 19 రోజులుగా మెరుపు సమ్మెలో పాల్గొని ఆసుపత్రి అత్యవసర సర్వీసులకు విఘాతం కలిగించడం ఎంతవరకు సమంజసమని యాజమాన్యం ఆ ప్రకటనలో ప్రశ్నించింది. కోవిడ్ తరువాత ఉద్యోగులతో అప్రకటిత సమ్మెలు చేయించి కొంతమంది ఉద్యోగాలు కోల్పోవడానికి కారుకుడైన వ్యక్తికి మిమ్స్ ఉద్యోగులంతా 2020లోనే తిలోదకాలు పలికారని యాజమాన్యం తెలిపింది. ఆ తరువాత మిమ్స్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్, మిమ్స్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ యూనియన్ 2021 సెప్టెంబరు 7వ తేదీన ఉద్యోగుల సంక్షేమం దృష్టిలో పెట్టుకుని డీఏతో కూడిన ఐదుశాతం వేతన ఒప్పందాన్ని యాజమాన్యంతో చేసుకుందని తెలిపారు. ఈ ఒప్పందం ప్రకారం 2021 ఆగష్టు 1వ తేదీ నుంచి ఏటా డీఏతో కూడిన 5 శాతం వేతనం అమలవుతోందని యాజమాన్యం వెల్లడించింది. కనీస వేతనాల చట్టం ప్రకారం డీఏ కూడా అమలవుతుందని యాజమాన్యం తెలిపింది. మిమ్స్ ఉద్యోగులు ఇప్పటికైనా వాస్తవాలను గ్రహించి విధులకు హాజరవ్వాలని యాజమాన్యం కోరింది.

అవకతవకలకు పాల్పడితే చర్యలు

రామభద్రపురం: ఉపాధి పథకం పనుల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏపీవో జి.త్రినాథరావు హెచ్చరించారు. ముచ్చర్లవలసలో ఉపాధి పనులను ఆయన సోమవారం పరిశీలించారు. గైర్హాజరైన వారి పేర్లను మస్తర్లలో వేయవద్దని సూచించారు. ఉపాధి కూలీలు రెండు పూటలా పనులు చేయాలని సూచించారు. ఈ తనిఖీల్లో ఫీల్డ్ అసిస్టెంట్ సత్యవతి, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

'నమస్తే'తో ఎంతో ఉపయోగం

విజయనగరం రింగురోడ్డు: పారిశుధ్య కార్మికుల ఆరోగ్య భద్రత, జీవన విధానం మెరుగుకు 'నమస్తే' కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు అన్నారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో 'నమస్తే' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సెప్టిక్ క్లీనర్స్, వాహన యజమానుల వద్ద పనిచేసే సిబ్బంది వివరాలు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు 'నమస్తే' కార్యక్రమాన్ని రూపొందించినట్టు తెలిపారు. ప్రజారోగ్య అధికారి సాంబమూర్తి, పారిశుధ్య పర్యవేక్షకులుబాలకృష్ణ పాల్గొన్నారు.

నేడు చింతలపాలెంలో సాహిత్య గోష్టి

కొత్తవలస: మండలంలోని చింతలపాలెం గ్రామంలో నున్న చిట్టిపాప తీర్థం సందర్భంగా గ్రామంలో సాహిత్య గోష్టిని నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు లెఇపారు. ప్రతి సంవత్సరం భాష్మ ఏకాదశమి సందర్భంగా గ్రామంలో తీర్థం నిర్వహించడం జరుగుతుంది. ఇందులో బాగంగా మంగళవారం ఉదయం 11 గంటల నుంచి ప్రముఖ సాహితీ వేత్త బులుసు అపర్ణ ఆధ్వర్యంలో మహాభారతంలోని వివిధ ఘట్టాలపై సాహిత్య గోష్టిని నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

గ్రామాల్లో జలజీవన్ మిషన్ పనులు

లక్కవరపుకోట: మండలంలోని కోనమసివానిపాలెం, కల్లేపల్లి పంచాయతీ పూడివానిపాలెం గ్రామాల్లో సోమవారం ఇంటింటికీ కుళాయి పనులు ప్రారంభమయ్యాయి. ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మండలస్థాయి అధికారులు జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా పనులు ప్రారంభించారు. అంతకుముందు రేగ గ్రామంలో సచివాలయం, ఆర్‌బీకే, వెల్నెస్ కేంద్రాలను ప్రారంభించారు. ఎంపీపీతో పాటు జక్కాన సింహాద్రప్పుడు, కల్లేపల్లి సర్పంచ్ జి.ము సలినాయుడు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పల్స్ పోలియో పై సమీక్ష

కొత్తవలస: మార్చి మొదటి ఆదివారం నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమానికి సంబంధించి సోమవారం కొత్తవలస పీహెచ్‌సీలో వైద్యాధికారి సీతల్‌వర్మ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. పీహెచ్‌సీ పరిధిలో గల 25 బూత్‌లలో అప్పుడే పుట్టిన పిల్లల నుంచి 5 సంవత్సరాలలోపు గల 4 వేల 27 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కిత్తన్నపేటలో పశువైద్య శిబిరం

లక్కవరపుకోట: మండలంలోని కిత్తన్నపేట గ్రామంలో సోమవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. మండల పశువైద్యాధికారి కే.గాయత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరానికి రైతుల నుంచి విశేష స్పందన లభించింది. సుమారు 60 పశువులకు వివిధ తనిఖీలు నిర్వహించారు. చూడు తనిఖీలతోపాటు గర్భకోశ వ్యాధి తనిఖీలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వేసవి పశుగ్రాసంపై రైతులు శ్రద్ధ వహించాలని గాయత్రి సూచించారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల సాయం

శృంగవరపుకోట: శృంగవరపుకోట జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదిగిన పూర్వ విద్యార్థులు ఈ పాఠశాల అభివృద్ధికి రూ.50వేల ఆర్థిక సాయం చేశారు. ఈ మొత్తాన్ని ప్రధానోపాధ్యాయురాలు టి.విజయలక్ష్మికి అందించారు. శనివారం పాఠశాలకు వచ్చిన పూర్వ విద్యార్థులు కాకినాడలో పనిచేస్తున్న డాక్టర్ కృష్ణకుమారి, రిటైర్డ్ హెచ్‌ఎం కె.లలిత కుమారి, వి.సీతారత్నం, ఎం.శారద, పి.శ్రీకళ, వి.సీత, జి.చంద్రవేణి, కె.భారతి, పి.కళావతి, అనంతలక్ష్మి తదితరులు పాఠశాలతో తమకు గల అనుబంధాన్ని వివరించారు. వీరందరినీ ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది సత్కరించారు.

స్థలం కేటాయించాలి

రాజాం రూరల్: విశ్రాంత సైనికోద్యోగుల సంక్షేమ సంఘ కార్యాలయం నిర్మాణం కోసం రాజాంలో స్థలం కేటాయించాలని రిటైర్డ్ సైనికోద్యోగులు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను రాజాంలో సోమవారం కోరారు. ఆ సంఘ అధ్యక్షుడు నాయక్ ఎన్.సురేష్ ఆధ్వర్యంలో నాయక్ ఉమామహేశ్వరరావు, నాయక్ డి.కుమార్‌రావు, హవాల్దార్ కె.సుధీర్, అప్పలరాజు మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశామని, రాజాం మున్సిపల్ కమిషనర్‌కు కలెక్టర్ స్థలం కేటాయించేందుకు అవకాశాలు పరిశీలించాలని సూచించినట్లు తెలిపారు.

24 నుంచి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు

కొత్తవలస: కంటకాపల్లి పంచాయతీ పరిధిలోనున్న శారదా కర్మాగారం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్టు కర్మాగార ప్రతినిధులు శంకర్, సంతోష్‌లు తెలిపారు. ఈ పోటీలు ఈ నెల 24 నుంచి 26 వరకు కొత్తవలస హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించనున్నట్టు వెల్లడించారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.1.25లక్షలు, ద్వితీయ బహుమతిగా రూ.60 వేలు, తృతీయ బహుమతిగా రూ.25 వేల నగదు అందజేస్తామని చెప్పారు. వివరాలకు 94935 48330 నంబరులో సంప్రదించాలని సూచించారు.

దుస్తులు ఆరబెట్టుకోవడానికి స్థలం ఇవ్వండి

కలెక్టరేట్: దుస్తులు ఆరబెట్టుకోవడానికి స్థలం కేటాయించాలని వేపాడ మండలం బొద్దాం గ్రామనికి చెందిన రజకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని పోరంబోకు స్థలంలో బట్టలు ఆరబెట్టుకుని జీవనం సాగిస్తున్నాం.. అయితే ఈ స్థలంను వేరే వ్యక్తులకు ఇవ్వడానికి ప్రయత్నం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే ఈ స్థలం తమకు కేటాయించాలని పైడి మాంబ రజక సంఘ నాయకులు డిమాండ్ చేశారు.

భూములకు రక్షణ కల్పించండి

రామభద్రపురం: కొట్టక్కి గ్రామంలో మంజూరు చేసిన డీపట్టా భూములకు రక్షణ కల్పించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ ఆకుల సులోచనారాణికి వినతిపత్రం అందించారు. కొన్నేళ్లుగా తమ భూములు కబ్జాకు గురవుతున్నాయని... అడ్డుకున్న తమపై దాడులు చేస్తున్నారని తెలిపారు. సాలూరుకు చెందిన కొంతమంది భూస్వాములు తమ భూములపై కన్నేసి డిపట్టా భూములు కబ్జా చేస్తున్నారని ఆమె దృష్టికి తెచ్చారు. వీటిని అరికట్టాలని కోరారు. డిపట్టా భూములను తాను వచ్చి పరిశీలిస్తానని తహసీల్దార్ హామీ ఇచ్చారు. డిప్యూటీ తహసీల్దార్ సుబ్బారావు, సీపీఐ నాయకులు లెంక లక్ష్మి పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మి



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

గజపతినగరం: నెలిమర్ల మండలంలోని మిమ్స్ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే పోరాటాలను ఉధృతం చేయనున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి వి. లక్ష్మి హెచ్చరించారు. సోమవారం స్థానిక జయింతికాలనీలో అంబేడ్కర్ విగ్రహం వద్ద కార్మికుల సమస్యలను పరిష్కరించాలని నిరసనతెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంఘం పెట్టుకుని హక్కులు,పోరాటాలు చేసే హక్కు రాజ్యాంగం కల్పిస్తేవారిహక్కులను కాలరాస్తు మిమ్స్ యాజమాన్యం వ్యవహరించడం తగదన్నారు. కార్మికులకురావల్సిన డీఎలు, వేతన ఒప్పందతం అమలుచేయాలని జనవరి వేతనం తక్షణమే అందజేయాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో కనకరాజు, గోవింద, ఏసు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు అప్పగించాలి



వినతిపత్రం అందజేస్తున్న కొత్తచెరుకుపల్లి గ్రామస్థులు

భోగాపురం: ఇళ్ల స్థలాలు అప్పగించాలని కొత్తచెరుకుపల్లి గ్రామానికి చెందిన పలువురు ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ పి.శ్యామ్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఇంటిస్థలాలు మంజూరుచేస్తూ పట్టాలిచ్చారని, అప్పట్లో స్థలాలు అప్పగించలేదని చెప్పారు.ఆ స్థలాలను స్థానికులు ఆక్రమించుకుని శాలలు, పునాదులు వేసుకుంటున్నారన్నారు.ఆస్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయని, ఆక్రమణను నిలుపుదల చేసి పట్టాలు ప్రకారం స్థలాలు అప్పగించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో రాయిఈశ్వరరావు, డెంకాడ బోగిరాజు, పి.రమాప్రభ పాల్గొన్నారు.

గొర్రెల పెంపకందారులకు పరికరాల పంపిణీ

చీపురుపల్లి: చీపురుపల్లిలో సోమవారం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 459 మందిగొర్రెల పెంపకందారులకు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సోమవారం నెట్,టార్చిలైట్, రైన్ కోట్ పంపిణీచేశారు. కార్యక్రమంలో ఎంపీ బెల్లానచంద్రశేఖర్, జడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జడ్పీ సీఈవో కె.రాజ్ కుమార్, పశు సంవర్ధకశాఖ ఏడీ, స్థానిక పశు వైద్యాధికారి శ్రీకాంత్, జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు మన్నాల కృష్ణ పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు దుస్తులు..

చీపురుపల్లి మండలంలోని వంగపల్లిపేట ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 12 మంది సమీకృత వసతి గృహం విద్యార్థులకు ఆ పాఠశాల ఉపాధ్యాయుడు ఎస్.బలరాంతన సొంతఖర్చుతో యూనిఫారాలు అందజేశారు. ఎంఈఓ ఎం.బూసి నాయుడు సోమవారం ఈ దుస్తులను విద్యా ర్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల సముదాయం చైర్మన్ కె.చంద్రశేఖర్ కుమార్, పీఆర్టీయూ, యూటీఎఫ్ ప్రతినిధులు వలిరెడ్డి రవీంద్రనాయుడు, మీసాల అప్పలనాయుడు, సీఆర్పీ కంది రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చీపురుపల్లి: చీపురుపల్లి ప్రాజెక్టుపరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ కేవీఎస్ రాజరాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. మెరకముడిదాం మండలంలోని పులిగుమ్మి, చినమంత్రిపేట గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, బోడందొరవలస, చీపురుపల్లి మండలంలోని మోదుగులపేట, రిక్షా కాలనీల్లో సహాయకుల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైన అభ్యర్థులు అర్హతల ధ్రువపత్రాలతో ఈ నెల 24లోగా తమ కార్యాలయానికి దరఖాస్తులు అందజేయాలని ఆమె తెలిపారు.

'వలంటీర్లతోనే ప్రభుత్వానికి గౌరవం'

చీపురుపల్లి: వలంటీర్ల కారణంగానే ప్రభుత్వ గౌరవం పెరిగిందని జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ వలంటీర్లకు ఆయన మిత్ర, రత్న, వజ్ర అవార్డులతో సత్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అందజేయడంలో వలంటీర్లు సాటి లేని సేవలందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ, జడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, సర్పంచ్ మంగళగిరి సుధారాణి, జడ్పీ సీఈఓ కె.రాజ్‌కుమార్, ఎంపీడీఓ డి.శ్వేత, నాయకులు ఇప్పిలి అనంతం, శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, ఇప్పిలి గోవిందరావు, పతివాడ రాజారావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మొయిద విజయరాంపురంలో నేత్ర వైద్య శిబిరం

నెల్లిమర్ల: నెల్లిమర్ల మొయిద విజయరాంపురంలో సోమవారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. వీవర్స్ సొసైటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కంటి వైద్య శిబిరాన్ని ఎంఎల్‌సీ డాక్టర్ పీవీవీ సూర్యనారాయణ రాజు(పెనుమత్స సురేష్‌బాబు)ప్రారంభించారు.కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పెనుమత్స సంతోష్ బాబు, సర్పంచ్ అట్టాడ కృష్ణ, బొమ్మన రాజారావు పాల్గొన్నారు.

అగరబత్తీల యూనిట్ పరిశీలన



అగరబత్తీల యూనిట్‌ను పరిశీలిస్తున్న నాబార్డు అధికారులు

నెల్లిమర్ల: రామతీర్థంలో అగరబత్తీలయూనిట్‌ను నాబార్డ్ డీజీఎం సోమవారం పరిశీలించారు. నాబార్డు సౌజన్యంతో గతఏడాది జనవరిలో రామతీర్థం దేవాలయంలో వాడిన పువ్వులతో అగరబత్తీలు, ధూప్‌స్టిక్స్ తయారీలో 30 మందికి శిక్షణఇచ్చారు. శిక్షణఅనంతరం రామతీర్థం ఏపీజీవీబీ, పీఎంఈజీపీ ద్వారా అగర్‌బత్తీల తయారీ యూనిట్‌ను నడిపిస్తున్నారు. ఈ యూనిట్‌ను నాబార్డు డీజీఎం ఎస్.ఫణిశేఖర్, డీడీఎం నాగార్జున పరిశీలించారు.కార్యక్రమంలో డీఆర్‌డీఓ ఏపీడీ కె.సావిత్రి, గరివిడి ఏరియా కోఆర్డినేటర్ బి.బంగారమ్మ, ఏపీఎంలు, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు. అనంతరం రామతీర్థం రామస్వామిని దర్శించుకున్నారు.

వైసీపీ నేత భూ ఆక్రమణలపై ఫిర్యాదు

పూసపాటిరేగ: చోడమ్మఅగ్రహారం పంచాయతీకి చెందిన మండల ఉపాధ్యక్షుడు, వైసీపీనాయకుడు నల్లపురాజు సత్యనారాయణరాజు పంచాయతీ పరిధిలో గల సర్వే నెంబరు1లో సుమారు50ఎకరాలు ఆక్రమించుకుని...పేదలకు భూములు లేకుండా చేశారని స్థానికులు, మాజీ సర్పంచ్ నల్లఅప్పలరాజు, గ్రామ పెద్దలు సోమవారం తహసీల్దారుకు ఫిర్యాదుచేశారు. ప్రభుత్వం ఆ నాయకుడి భార్య, కుమారుడు, కుటుంబసభ్యుల పేరుతో సుమారు 10 ఖాతాలతో పట్టాలు ఎలా మంజూరు చేశారని ప్రశ్నించారు. వెంటనే విచారణ చేపట్టి గ్రామంలో గల నిరుపేదలకు భూమిని పంపిణీ చేయాలని కోరారు.



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్థులు



గజపతినగరం: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేఏ నాయుడు



నెల్లిమర్ల: హెచ్‌డీటీ శైలజకు వినతిపత్రం అందజేస్తున్న విలేకరులు



దత్తిరాజేరు: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

ఫొటోగ్రాఫర్‌పై దాడికి నిరసన

● జిల్లావ్యాప్తంగా జర్నలిస్టుల ర్యాలీలు

● నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ నాయకులు దాడిచేయడాన్ని ఖండిస్తూ జిల్లావ్యాప్తంగా సోమవారం జర్నలిస్టులు, పలు సంఘాల, టీడీపీ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు ర్యాలీలు నిర్వహించి అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. తక్షణమే నిందితులపై చర్యలు తీసుకోవాలని జర్నలిస్టులు డిమాండ్‌చేశారు.

పత్రికా స్వేచ్ఛను కాలరాస్తున్న జగన్

గజపతినగరం: పత్రికాస్వేచ్ఛను కాలరాస్తున్న జగన్‌ప్రజాస్వామ్యానికి విలువఇవ్వని జగన్‌చేయాల్సింది సిద్ధం సభకాదని రాజీనామాకు సిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే కేఏ నాయుడు డిమాండ్ చేశారు. గజపతినగరం టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ వ్యతిరేకతను వెలుగులోకి తీసుకువస్తున్న విలేకర్లపై దాడులు చేయించేవిధంగా జగన్ ప్రోత్సహించడం అమానుషమన్నారు. అనంత పురం జిల్లా రాప్తాడులో జరిగిన సిద్ధంసభలోఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిచేసి కొట్టడం దారుణమన్నారు.సభకు మద్యం సేవించి వచ్చి దాడులకు పాల్పడం బాధాకరమన్నారు.

●**నెల్లిమర్ల:** జర్నలిస్టులపై దాడులు హేయకరమని ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు ఆరిపాక రాము తెలిపారు. రాప్తాడులో సిద్ధం సభకు విధుల్లో భాగంగా హాజరైన ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై కొందరు దాడి చేసి గాయపరిచిన సంఘటనపై నెల్లిమర్ల ప్రెస్‌క్లబ్ విలేకరులు విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కాళ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో హెచ్‌డీటీ డి.శైలజను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ నెల్లిమర్ల నియోజకవర్గ అధ్యక్షుడు పతివాడ రమణ, విలేకరులు కొండల సీతారామ్, శ్రీను, కె.సత్యనారాయణ, శనపతి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

●**దత్తిరాజేరు:** రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ అల్లరి మూకలు జరిపిన దాడికి మండలంలోని విలేకరులు నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ సుదర్శనరావుకు వినతిపత్రం అందజేశారు.

ఫొటోగ్రాఫర్‌పై దాడి అమానుషం

రామభద్రపురం: అనంతపురం జిల్లా రాప్తాడ్ ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్‌పై వైసీపీ గూండాలు దాడి చేయడం అమానుషమని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలుబాయి రమణమ్మ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం వారు విలేఖర్లతో మాట్లాడుతూ నిజాలు నిర్భయంగా బయటపెట్టే పత్రికా విలేఖర్లపై దాడులుచేయడం ప్రజాస్వామ్యానికి మంచిదికాదని అన్నారు. ఇటువంటి చర్యలకు పాల్పడినవారిని కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఉందన్నారు. వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్‌కు పంపిస్తానని తహసీల్దార్ తెలిపారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు లెంక లక్ష్మీ పాల్గొన్నారు.

●ఫొటోగ్రాఫర్‌పై దాడిని నిరసిస్తూ తహసీల్దార్ ఆకుల సులోచనారాణికి విలేఖర్లు వినతిపత్రం అందించారు. దాడిచేసిన వారిపై కఠినమైన సెక్షన్లు విధించి కేసులు నమోదుచేయాలని కోరారు.ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు ఆకుల వెంకటరావు, పెంకి మణిబాబు, చొక్కాపు రామకృష్ణ పాల్గొన్నారు.

●ఫొటో గ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిని జిల్లా తెలుగుదేశంపార్టీ ఉపాధ్యక్షుడు మడక తిరుపతినాయుడు, బీసీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కర్రోతు తిరుపతిరావు, మండల తెలుగుయువత అధ్యక్షుడు ముల్లు రాంబాబు, తెలుగు యువత నాయకుడు గంటా సాయికుమార్, నర్సాపురం సర్పంచ్ కోట వెంకటనాయుడు, రొంపల్లి ఎంపీటీసీ జెవర శంకరరావులు ఖండించారు. దాడిచేసిన వారందరినీ పోలీసులు శిక్షించాలని డిమాండ్ చేశారు.

పత్రికా స్వేచ్ఛను కాలరాస్తున్న జగన్ : కళా

రాజాం: పత్రికా స్వేచ్ఛను సీఎం జగన్‌రెడ్డి కాలరాస్తున్నారని పొలిట్ బ్యూరో సభ్యుడు కిమిడి కళావెంకటరావు సోమవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. అనంతపురం జిల్లా రాప్తాడులో సిద్ధం కార్యక్రమానికి వెళ్లి ఫొటోలు తీస్తున్న కృష్ణపై దాడి చేయించడం వైసీపీ ప్రభుత్వం చేసిన దుర్మార్గపు చర్యలు అన్నారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో ప్రజా స్వేచ్ఛను దెబ్బతీసుస్తున్నారని కళా ఆగ్రహం వ్యక్తం చేశారు.

దాడి హేయమైన చర్య: కోండ్రు

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై సిద్ధం సభలో విచక్షణా రహితంగా వైసీపీ నేతలు దాడి చేయడం హేయమైన చర్య అని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోండ్రు మురళీ ఒక ప్రకటనలో ఖండించారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో ప్రజా స్వేచ్ఛను హరించడమే కాకుండా పైశాచికత్వాన్ని పొందుతున్నారని వైసీపీ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

●ప్రశ్నించే గొంతులను నొక్కేయడమే ధ్యేయంగా అధికార వైసీపీ పార్టీ వ్యవహరిస్తుందని వారి తప్పులను ఎత్తిచూపే ప్రతిపక్షాలను వేధింపులకు గురిచేయడం అలవాటుగా మారిందని జనసేన రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జీ ఎన్నిరాజు ఒకప్రకటనలో ఖండించారు. ఈ విషయంలో పోలీసుఉన్నతాధికారులు స్పందించి చర్యతీసుకోవాలని కోరారు.

● **లక్కవరపుకోట:** ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ అల్లరిమూకలు జరిపిన దాడి అమానుషమని ఎస్.కోట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, మాజీ జెడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు ఒక ప్రకటనలో ఖండించారు. వైసీపీ పిచ్చి మూకలకు ఈ దాడి నిదర్శనమని, వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు.

నెల్లిమర్ల: జర్నలిస్టులపై ప్రత్యక్ష దాడులకు దిగడం హేయమైన చర్య అని సీనియర్ టీడీపీ నాయకులు సువ్వాడ రవిశేఖర్ అన్నారు. సోమవారం ఆయన విలేఖర్లతో మాట్లాడారు. రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

ఆర్టీసీ రాదు.. అగచాట్లు తప్పవు

● ప్రైవేటు వాహనాల నిర్వాహకుల దోపిడీ ● ఇదీ భోగాపురం మండలంలో పరిస్థితి



భోగాపురం నుంచి గ్రామాలకు ప్రయాణికులను తీసుకువెళ్లేందుకు ఉన్న ఆటోలు

భోగాపురం

భోగాపురం మండలంలోని పదుల సంఖ్యలో గ్రామాలకు ఆర్టీసీ సేవలు అందుబాటులో లేకపోవడంతో అవస్థలు తప్పడం లేదు. గమ్యస్థానాలకు చేరుకోవడానికి గ్రామీణ ప్రాంత ప్రయాణికులకు అగచాట్లు తప్పడంలేదు. దీన్ని ఆసరాగా చేసుకుని ప్రైవేటు వాహనాల నిర్వాహకులు ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలుచేసి దోపిడీకి పాల్పడుతు న్నారు. భోగాపురం నుంచి నిరంతరం ఇతర గ్రామాలుపట్ట ణాలు, జిల్లా కేంద్రానికి వందలాది మంది రాకపోకలు సాగిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

మండలంలోని 22 పంచాయతీలకుగాను 18 పంచాయతీలకు ఆర్టీసీ బస్సు సౌకర్యంలేదు. అయా గ్రామాలకు ఇప్పటి వరకూ బస్సులు లేక ప్రైవేటు వాహనాలపైనే ఆధారపడుతున్నారు. ముక్కాం, కొండ్రాజుపాలెం, చేపలకంచేరు తీరప్రాంత గ్రామాల్లోని మత్స్యకారులు సముద్రంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. వీరంతా ప్రతిరోజూ సముద్రంలో వేటకు వెళ్లి మత్స్యసంపద సేకరిస్తారు. సేకరించిన సంపదను పట్టణ ప్రాంతాలకు తరలించి విక్రయించేందుకు ఆర్టీసీ బస్సులు లేక ప్రైవేటు వాహనాల్లో అధిక చార్జీలు చెల్లించి తరలించాల్సి వస్తోందని మత్స్యకారులు వాపోతున్నారు. కొన్ని సార్లు అధిక చార్జీలు చెల్లించలేక స్థానికంగా తక్కువ ధరకే మత్స్యసంపద విక్రయిస్తున్నామని మత్స్యకార మహిళలు చెబుతున్నారు.

చదువులకు దూరం..

మండలంలోని అన్ని గ్రామాల నుంచి విజయనగరం, తగరపువలస, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో వందలాది మంది ఉన్నత చదువుల కోసం రాకపోకలు సాగిస్తున్నారు. భోగాపురంలో ఉన్నత విద్యాసంస్థలు లేకపోవడం, పట్టణ ప్రాంతాల్లో ఉండేందుకు ఆర్థికభారం కావడంతో ప్రతిరోజూ సాయంత్రం ఇంటికి చేరుకుంటున్నారు. అయితే విద్యా సంస్థలకు తెల్లవారి చేరుకునే సమయంలో, తిరిగి ఇంటికి వచ్చేందుకు ఆర్టీసీ బస్సు సౌకర్యం గ్రామీణప్రాంతాల నుంచి లేకపోవడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. కొందరు బాలికలు బస్సుసౌకర్యం లేక మధ్యలోనే చదువులు ఆపేయాల్సి వస్తోంది. అయితే కరోనా తర్వాత ఆటోల నిర్వాహకులు భారీగా చార్జీలు పెంచడంతో ఆర్థిక భారంగా మారిందని విద్యార్థులు వాపోతున్నారు. సకాలంలో విద్యా సంస్థలకు కొన్నిసార్లు చేరుకోలేకపోతున్నా మని పలువురు చెబుతు న్నారు. అలాగే పలుగ్రామాల నుంచి చిరువ్యాపారులు నిరం తరం విజయనగరం వెళ్లి సామగ్రి కొనుగోలు చేస్తున్నారు. తమ గ్రామాలకు సరుకులు తరలింపునకు ఆటోల నిర్వాహ కులు అధికంగా చార్జీలు వసూలుచేస్తుండడంతో వ్యాపారాలు చేయలేకపోతున్నామని వారు చెబుతున్నారు.

ఉద్యోగుల బేజారు..

మండలంలోని పలు గ్రామాల్లో సచివాలయాల ఉద్యో గులు, పాఠశాలల ఉపాధ్యాయులు విధులకు సకాలంలో హాజరుకావడానికి అగచాట్లకు గురవుతున్నారు. వీరంతా ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో ప్రైవేటు వాహనాల్లో వెళ్లాల్సివస్తోంది. జాతీయరహదారికి ఆనుకుని ఉన్న భోగాపురం, సవరవల్లి, పోలిపల్లి, రాజాపులోవ గ్రామాల పరిధిలో మాత్రమే ఆర్టీసీ బస్సు సేవలు అందుబాటులో ఉన్నాయి. ప్రధానంగా మండలంలో పలు గ్రామాల ప్రజలు సామగ్రి, దుస్తులు కొనుగోలుకు విజయనగరం వెళ్లాల్సివస్తోంది. అయితే గ్రామీణ ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సు సదుపాయం విజయనగరం వరకూ లేదు. దీంతో ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది.

ఎక్స్‌ప్రెస్‌లు ఆగక అవస్థలు..

జాతీయ రహదారి విస్తరణలో భాగంగా భోగాపురం వద్ద ఫ్లైఓవర్ నిర్మించారు. దీంతో భోగాపురం వద్ద ఎక్స్‌ప్రెస్‌లు నిలుపుదల చేయడంలేదు. పై నుంచి బస్సులు వెళ్లిపోతున్నాయి. దీంతో భోగాపురం మండలంలోని వందలాది గ్రామాల ప్రజలు విశాఖ వైపు, ఇటు శ్రీకాకుళం రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. భోగాపురంలో ఎక్స్‌ప్రెస్‌లు నిలుపుదల చేయాలని ఆర్టీసీ అధికారులకు పలుసార్లు విన్నవించినా ఫలితం లేకుండాపోయిందన్నారు.

బస్సులు ఆగకపోతే ఫిర్యాదు చేయండి..

భోగాపురం- విశాఖ రూట్‌లో మాబస్సులే లేవని, అన్నీ విశాఖ, శ్రీకాకుళం డిపోల బస్సులే తిరుగుతున్నాయని విజయనగరం ఆర్టీసీ డిపో మేనేజర్ కె.గంగాధర్ తెలిపారు. విశాఖ ఆర్టీసీ డిపోకు చెందిన అన్ని ఎక్స్‌ప్రెస్ బస్సులు నిరంతరం భోగాపురం సర్వీస్ రహదారిపై నుంచే రాకపోకలు సాగిస్తున్నాయని చెప్పారు.అక్కడ అన్ని బస్సులకు స్టేజ్ కూడా ఉందని తెలిపారు. విశాఖ డిపోకు చెందిన ఏ ఒక్క ఎక్స్‌ప్రెస్ బస్సు ఆగకపోయినా, సర్వీస్ రహదారిపై నుంచి వెళ్లక పోయినా తప్పకుండా ఫిర్యాదు చేయాలని చెప్పారు. అటువంటి బస్సు సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాగా మా డిపోకు చెందిన ఇచ్ఛాపురం ఎక్స్‌ప్రెస్ బస్సు ఒకటే ఉందని శ్రీకాకుళం ఆర్టీసీ డిపో-1 మేనేజర్ మల్లిఖర్జునరాజు తెలిపారు. ఆ బస్సు సర్వీస్ రహదారిపై నుంచే వెళ్తుందని, అలా వెళ్లకపోయినా నిలుపుదల చేయకపోయినా ఫిర్యాదు చేయాలని కోరారు.

'సూపర్ సిక్స్'తో అన్ని వర్గాలకు మేలు

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున

చీపురుపల్లి: టీడీపీ ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున తెలిపారు. మండలంలోని పల్లిపేటలో సోమవారం రాత్రి ఇంటింటికి వెళ్లి మేనిఫెస్టోను వివరించారు.కార్యక్రమంలో పార్టీ నాయకులు రౌతు కామునాయుడు, ముల్లు రమణ, గవిడి నాగరాజు, జనసేన నాయకుడు విసినిగిరి శ్రీనివాసరావు, రెడ్డి లక్ష్మణరావు, వెంపడాపు లక్ష్మునాయుడు, రెల్లి మహేష్, గిరడ బాగినాయుడు, రెల్లి రాము, రెల్లి తాతారావు, లింగాల అప్పారావు, వెంపడాపు సత్యన్నారాయణ, రేగిడి మహేష్ పిన్నింటి దుర్గారావు పాల్గొన్నారు.



చీపురుపల్లి : మేనిఫెస్టోను వివరిస్తున్న నాగార్జున

ఫ్యాన్ రెక్కలు విరిచేందుకు ప్రజలు సిద్ధం: బంగార్రాజు



మాట్లాడుతున్న బంగార్రాజు

భోగాపురం: వైసీపీ ఫ్యాన్‌కు రెక్కలు విరిచేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు తెలిపారు. సోమవారం మండలం పోలిపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ అభివృద్ధి పాలన ఎవరిదో విధ్వంస పాలన ఎవరిదో ప్రజలకు తెలుసన్నారు. ఎవరి పాలన స్వర్ణయుగమో, ఎవరిది రాతి యుగమో ప్రజలు గమనిస్తున్నారన్నారు. వీటిపై బహిరంగ చర్చకు వచ్చే దమ్ము జగన్‌రెడ్డికి ఉందాఅని అన్నారు. ఓటమిభయంతో 77 మందిని జగన్ మడతపెట్టారని, మిగిలిన వారిని జనం మడత పెడతారన్నారు. ఎక్కడా కూడా అభివృద్ధిలేదని, వైసీపీకి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

యువత మేల్కోవాలి

గజపతినగరం: రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని... వైసీపీ అధికారం చేపట్టి ఐదేళ్లు పూర్తి కావస్తున్నా రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి, సంక్షేమం కానరావడం లేదని.. ఉద్యోగ అవకాశాలు లేక లక్షలాది మంది నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి కేఏ నాయుడు అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిద్ధం సభలో ప్రతిపక్షాలపై ఆరోపణలు చేయడం తప్ప చేసిన అభివృద్ధిని చెప్పలేకపోతున్న జగన్ రాష్ట్రానికి అవసరమా అని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ రెక్కలు విరిచేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు ఎ.లక్ష్మునాయుడు, బొండపల్లి మాజీ సర్పంచ్ బండారు బాలాజీ, మిత్తిరెడ్డి వెంకటరమణ, ప్రదీప్ కుమార్, డాకి నారాయణప్పలనాయుడు పాల్గొన్నారు.

'ఏం చేశారో ప్రజలకు చెప్పాలి'

రాజాం రూరల్: 'వాళ్లేం చేశారో..మేం ఏం చేయలేదో ప్రజలకు చెప్పాలి.. అంతేగానీ నోరుందని ఇష్టారాజ్యంగా మాట్లాడితే సమాజం హర్షించదు. వాళ్లు చేయరు.. మేం చేస్తే అందులోవంకలు,డొంకలు వెతుకుతారు.. అని మంత్రి బొత్స సత్యనారాయణ పరోక్షంగా టీడీపీ నాయకులపై విమర్శించారు. రాజాంలో ఆర్టీసీ కాంప్లెక్స్, సబ్ ట్రెజరీ కార్యాలయం,అర్బన్ హెల్త్ సెంటర్లను సోమవారం ప్రారంభించారు.ఈసందర్భంగా కాంప్లెక్స్ ఆవరణలో నిర్వహించిన సభలోటీడీపీ నాయకులపై విమర్శలు చేశారు.

శ్మశాన వాటిక అభివృద్ధికి కృషి

గరివిడి: కొండపాలెంలో సోమవారం శ్మశాన వాటికను శుభ్రపరిచారు. అక్కడ ఉన్నచెత్తతో పాటు మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ దాతలు ముందుకు వస్తే మరింత అభివృద్ధి చేద్దామన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ఎస్ శర్మ, టి.కమలాకరరావు, లయన్స్ సభ్యులు పాల్గొన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

పూసపాటిరేగ: బెల్టుషాపు నిర్వహిస్తున్న ఒక వ్యక్తి నుంచి 12 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సన్యాసినాయుడు తెలిపారు. బెల్టుషాపును నడుపుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నేటి నుంచి హజరత్ ఖాదర్ బాబా ఉరుసు

విజయనగరం రూరల్: స్థానిక ఖాదర్‌నగర్‌లో గల హజరత్ ఖాదర్‌బాబా 65వఉరుసుమహోత్సవ్ మంగళవారం ప్రారంభం కానుంది. మూడు రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుం దని దర్గా ధర్మకర్త డాక్టర్ ఎండీ ఖలీలుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ (ఖలీలుబాబు) తెలిపారు.సోమవారం ఆయన మాట్లాడుతూ మంగళవారం ఉదయం ఖురాన్ షరీఫ్‌పఠనంతో ప్రారంభమవుతుం దనిచెప్పారు.అనంతరం జెండామహోత్సవం, బాబాకిచాదర్ సమర్పిస్తామన్నారు. బుధవారం ఖాదర్‌బాబా ఊరేగింపు జరుగుతుందని తెలిపారు. గురువారం ప్రత్యేక ప్రార్థనలు, చాదర్ సమర్పణ, దస్తార్ బందీ, భక్తులకు తబరుక్కు ప్రసాదాల పంపిణీ, సలాం ఖుల్ షరీఫ్‌తో ఉరుసు గంధ మహోత్సవం ముగుస్తుందని తెలిపారు.